REGD. NO. A. 40 విడి ప్రతి 0-3-0 శుక్రవారం 4-9-59

# జమీన్ రైతు

సంపుటి 31 : సంస్థాపకుడు : నెల్లూరు వెంకట్రామానాయుడు : సంపాదకుడు :: నెల్లూరు శ్రీరామమూర్తి : సంచిక 36

# రక్షణ మంత్రి రాజకీయాలు చొప్పిస్తున్నారా?

## ఢిల్లీపత్రికల వార్తలు: తిమ్మయ్య రాజీనామాలోని అంతర్యం?

భారత సర్వసైన్యాధ్యక్షుడు శ్రీ తిమ్మయ్య - వైమానిక నావికాధిపతులు, రక్షణ శాఖామాత్యులు శ్రీ వి. కె. కృష్ణమీనన్ రాజీనామా యిచ్చారనే వార్త, ఢిల్లీలోని ఒక పత్రికలో ప్రకటింపబడగా, పార్లమెంటులో, దేశంలో తీవ్ర సంచలనం, కలవరం కలిగింది. ఈ వార్త ప్రకటింపబడినరోజు పాకిస్థాన్ ప్రెసిడెంటు అయూబ్ ఖాన్ ఢిల్లీకి రావడం; మన ఉత్తర సరిహద్దులో చైనా సైన్యాలు తలుపుతట్టుతుండడం - యీ సంక్లిష్ట సమయంలో దేశరక్షణ బాధ్యత వహించవలసిన సైనికశాఖలో యీ కలతలు కలగడం, మరింత ఆందోళనకు హేతువైంది.

ఎట్లనయితేనేమి తిమ్మయ్యగారొక్కరు మాత్రం రాజీనామా యిచ్చారని, తక్కినవారి రాజీనామాలంటూ తనకేమీ చేరలేదని, తిమ్మయ్యగారు తన సలహాపై రాజీనామాను ఉపసంహరించుకున్నారని, వీరి రాజీనామాకు రాజకీయాలేమీ కారణంగాదని, ప్రధాని శ్రీ జవహర్లాల్ నెహ్రూ పార్లమెంటులో ప్రకటించడం - వేడెక్కిన వాతావరణాన్ని తాత్కాలికంగా కొంత చల్లబరచినా, దీనిపై తర్జన-భర్జనలు సమసిపోయి, భయాందోళనలు ప్రజల హృదయాలనుండి పూర్తిగా తొలగిపోవుటకు చాలకాలం పట్టవచ్చు.

సర్వసైన్యాధ్యక్షుడు రాజీనామా యివ్వడం అసాధారణమైన విషయం. సైన్యాధికారులు పర్యాధికార్లవుతున్న యీ సమయంలో మన సైన్యంలో వచ్చిన విభేదాలు, అసంతృప్తులు, ప్రజాస్వామ్య వాదులను కలవరపెడుతున్నవి.

తిమ్మయ్య రాజీనామా యివ్వవలసి వచ్చుటకు దారితీసిన ప్రబలమైన కారణాలేమైవుంటాయనే ప్రశ్న వున్నది. సైనికాధికార్ల ప్రమోషన్ల విషయంలో వచ్చిన విభేదాలే కారణమని అంటున్నారు. ఈ స్వల్ప కారణానికి సర్వసైన్యాధ్యక్షుడు రాజీనామా యివ్వడం జరుగుతుందా? అనే అనుమానం వెలిబుచ్చబడుతున్నది. సైన్యంలో చొప్పిస్తున్న రాజకీయాలు ఇందుకు హేతువుగా వుండవచ్చునని వూహాగానాలు జరగకుండా పోవడంలేదు.

రక్షణ శాఖామంత్రి శ్రీ కృష్ణమీనన్ రాజకీయాలు, పక్షపాతాలు, కలుగజేసుకొనే యీ విభేదాలకు, విచారకర సంఘటనలకు కారణమనే వదంతులు లేకపోలేదు. వదంతులేగాదు కృష్ణమీనన్‌మీద బహిరంగంగా కొండంత ఆరోపణలు చేయబడుతున్నవి.

తిమ్మయ్య రాజీనామా ప్రసక్తి పార్లమెంటులో వచ్చినపుడు, మానసంపహించి యున్న కృష్ణమీనన్‌ను ఆచార్య కృపలానీ తీవ్రంగా విమర్శించారు. సైన్యాధికార్ల ప్రమోషన్ విషయంలో, శ్రీ కృష్ణమీనన్ రాజకీయ పక్షపాతాన్ని చూపుతున్నాడనే అభిప్రాయం కలదని కృపలానీ ఆరోపించారు. శ్రీ కృష్ణమీనన్ కమ్యూనిష్టు పక్షపాతి అని తేలగా చెప్పకుండా, ఒక భారతవిమానాన్ని పాకిస్థాన్ కూల్చగా, దానిని దురాక్రమణ అని బిగ్గరగా అరచిన శ్రీ కృష్ణమీనన్, చైనా మన సరిహద్దులను దురాక్రమణ చేస్తే పెదవి మెదపలేదని, ఆ (చైనా) దురాక్రమణ, యీ (పాకిస్థాన్) దురాక్రమణంత ముఖ్యంగాదని వారు భావించారేమోనని విమర్శించారు ఆచార్య కృపలానీ.

ఒక్క శ్రీ కృపలానీయే గాదు, శ్రీ కృష్ణమీనన్ కమ్యూనిష్టు అభిమాని అనే ఆరోపణ అన్నివర్గాలనుండి – కమ్యూనిష్టులనుండి తప్ప – అప్పుడప్పుడు వినబడుతూనేవుంది. దక్షిణాది పత్రికలలో అంత ప్రాముఖ్యం వహించదుగాని, కృష్ణమీనన్ కమ్యూనిష్టు అభిమాని అని, ఉత్తరాది పత్రికలలో, ముఖ్యంగా భారత రాజధాని పత్రికలలో తరచు అత్యంత ప్రాధాన్యంవహిస్తూ, నిశితమైన విమర్శలు కురిపించబడుతుంటాయి.

కృష్ణమీనన్ రక్షణ శాఖ తీసుకున్న రెండు సంవత్సరాలలో, అంతకుముందు పదేళ్లలో ఎవ్వరూచేయలేని, మహత్కార్యాలను సాధించాడని, ప్రధాని శ్రీ నెహ్రూ పార్లమెంటులో పలికిన ప్రశంసా వాక్యాలలో ఎంతవుంది ఏకీభవిస్తే అనిపిస్తుంది ఎవరు లేము కాని; కొన్ని అనుచితమైన చేశారన ఒక్కళ్ళు తప్పదు. కాని వారు చేసిన అనుచితమును కన్నా, వారు ఆ శాఖకు చేస్తున్న అపకారమే ఎక్కువని భావించేవారు లేకపోలేదు.

సైన్యంలో కృష్ణమీనన్‌పట్ల వ్యక్తిగత విశ్వాసమున్నవారితో కొల్లలుగ (వర్గాలు) వున్నవని; మీనన్ కు అభిమాన పాత్రులైన



రక్షణమంత్రి శ్రీ కృష్ణమీనన్

సైనికాధికారుల సమావేశాలు రహస్యంగా జరుగుతుంటాయని, సైన్యం ఏనాడైనా నిర్వర్తించవలసివచ్చే రాజకీయ పవిత్ర కార్యం కొరకు తాము సిద్ధపడవలసి వుంటుందనే మాటలుకూడా వినబడుతుంటాయని; సైనికులు రాజకీయ సుడిగుండంలో చిక్కుకున్నారని, కాలాతీతం కాకముందే వాటిని రక్షించవలెనని మున్నగు వ్యాఖ్యలు, విమర్శలు ఢిల్లీ పత్రికలలో కనుపిస్తున్నవి. హంగరీ, కొరియ విషయాల్లో మీనన్ కమ్యూనిష్టు పక్షపాతం వెల్లడైందనికూడా యీ పత్రికలంటున్నవి.



సర్వసైన్యాధ్యక్షుడు శ్రీ తిమ్మయ్య

మీనన్ అంటే కమ్యూనిష్టులకుకూడా అభిమానం ఎక్కువ. తిమ్మయ్య రాజీనామా మీద, కాంగ్రెస్ సభ్యులు మౌనం వహించినా, కృష్ణమీనన్ రక్షణకు నిలబడింది కమ్యూనిష్టులుగానే కనబడుతున్నారు. మామూలుగా కూడా వీరు మీనన్‌ను సమర్థిస్తుంటారు.

ఏమైనా సైన్యంలో యీ విపరీతాలు జరగడం దేశభద్రత దృష్ట్యా శ్రేయస్కరం గాదు. అంతేగాక—మన సైన్యాలు ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనుటకు సమగ్రవంతంగా, సంసిద్ధంగా వున్నాయని,

—కొరవ 6 వ పేజీలో

నిర్మల స్పెషల్ * * *

కాఫీ పొడి - వక్క పొడి

❖ కాఫీ గింజలు వేయించినవి

పచ్చివి అమ్మబడును

నిర్మల కాఫీవర్క్సు

ట్రంకురోడ్డు — నెల్లూరు

## వార్తలు = వ్యాఖ్యలు

### నెహ్రూ-అయూబ్

పాకిస్థాన్ నియంత అయూబ్ ఖాన్, భారత ప్రధాని శ్రీ జవహర్లాల్ నెహ్రూల మధ్య 1 తేది ఢిల్లీ విమానాశ్రయంలో 75 నిముషాలసేపు సమావేశం జరిగింది. ఇరుదేశాల మధ్య అపరిష్కృతంగావున్న సమస్యలపై స్థూలంగా సంప్రతింపులు సాగినవి. ఈ సమావేశం మామూలుగానే- 'స్నేహపూర్వకంగా, సుహృద్భావ వాతావరణంలో'- జరిగింది. సమావేశానంతరం ఒక చిన్న సంయుక్త ప్రకటనకూడా విడుదలచేశారు.

అయూబ్ ఖాన్-నెహ్రూలు స్వయంగా ప్రప్రథమంగా పరిచయులుగావడం యిదే. నెహ్రూగారిఅన్నా, వారి భావాలన్నా తన కెంతో గౌరవమూ, ఆసక్తీ అన్నాడు కరాచీనుండి బయలుదేరేముందు అయూబ్! దానినిబట్టే వారిద్దరిమధ్య జరుగబోయే స్వల్ప కాల సంభాషణల తీరు ఏ విధంగా వుండబోయేదీ తెలిసింది.

ఇండియా-పాకిస్థాన్ మధ్య, యీ రెండు దేశాలు ఏర్పడిన నాటినుండి వివాదంగావున్న సమస్యలు నేటికీ వివాదంగానే వున్నాయి. ఇందులో తూర్పు సరిహద్దు అతిక్రమణలు, కాల్వలసమస్య ప్రస్తుతం తీవ్ర సమస్యగా పరిణమించింది. దీని పరిష్కారానికి మంత్రివర్గ స్థాయిలో సమాలోచనలు జరగాలని అయూబ్ ముఖ్యమైన సమాధానం చెప్పారు. ఇవిగాక కాశ్మీర్, కాల్వనీటితగాదాలు, పాత అప్పులు, కాందిశీకుల ఆస్తుల వంటి సమస్యలున్నాయి. సామరస్యపూర్వకంగా వీటి పరిష్కారానికి యీ పన్నెండేళ్ళనుండి వున్న అధికార్లనుండి, మంత్రుల వరకు సంభాషణలు సాగినవి. పాకిస్థాన్ ప్రథమ ప్రధాని లియాఖత్ మొదలు కడపటి ప్రధాని నూన్ వరకు, మన ప్రధానితో సమాలోచనలు జరిపారు. ఈ సమావేశాల సమయంలో పరిష్కారం కనుచూపుమేర లోకివచ్చినట్లు కనబడడం, కాంతి సుహృద్భావ వాతావరణం వెల్లివిరియడం, తర్వాత యుద్ధ నినాదాలు వినిపించడం పరిపాటి అయిపోయింది. అయూబ్ ఖాన్ కు సంబంధించినంతవరకు సమాలోచనల ఫలితం యీ విధంగానే వుంటుందా?

### ● నెహ్రూ-అయూబ్ ప్రప్రథమ సమావేశం

పాకిస్థాన్ నియంత అయూబ్ ఖాన్, భారతప్రధాని నెహ్రూ ప్రప్రథమంగా ఢిల్లీలో సమావేశమై, రెండుదేశాలమధ్య అపరిష్కృతంగావున్న సమస్యలనుగూర్చి చర్చించారు. ఈ సమస్యలు శాశ్వత పరిష్కారంలో, గతంలో ఏ పాకిస్థాన్ ప్రధానికిలేని అవకాశం, అయూబ్ ఖాన్ కు వున్నది. అయూబుకు చిత్తశుద్ధివుంటే రెండుదేశాలు మిత్రదేశాలుగా శాశ్వతంగా మనగలవు

### ● కలకత్తాలో కమ్యూనిస్టు కల్లోలం

కేరళ ప్రతీకారానికి ఆహర సమస్యపేరుతో కమ్యూనిస్టులు కలకత్తాలో కల్లోలం కల్గించారు. తొమ్మిదిమంది అమాయకులు ప్రాణాలుగోల్పోయారు. ఆహర సమస్యాపరిష్కారానికి అరాచకమార్గంకాదు, నిర్మాణాత్మకమైన సలహా సహకారాలె మార్గమని, యీవుద్యమంలో చేరకుండుట ద్వారా ప్ర. సో. పార్టీ ఋజువుచేసింది.

### ● కాంగ్రెస్-ప్రజాసోషలిస్టుపార్టీ కలయిక

స్వతంత్రపార్టీ అవతరణదృష్ట్యా, ప్ర సో. పార్టీ కాంగ్రెస్ లో క్రమంగా విలీనమైపోతుందా అనే వూహలు కలుగుతున్నవి. కేరళలో యీరెండు పార్టీలమధ్య ఏర్పడుతున్న పొత్తు విజయవంతమైతే, అది అన్నిరాష్ట్రాలకు విస్తరించి, క్రమంగా రెండూ ఒకటయ్యే అవకాశముండవచ్చు.

ఆ విధంగా వుండవలసిన అవసరంలేదు. గతంలో ప్రధానులు రాజకీయవాదులు. తమ స్వార్థ రాజకీయాలకు, తమ అసమర్థ పాలనకు కేసారిన ప్రజలలో, యీసమస్యల ద్వారా యిండియాపై ద్వేషం కల్పించి, అవి పరిష్కారంగాకుండా చూచేవారు. అయూబ్ ఖాన్ కు ఆ అవసరంలేదు. తాను హృదయపూర్వకంగా ఇండియా - పాకిస్థాన్ శాశ్వత స్నేహాన్ని వాంఛిస్తే, అయూబ్ వాటి పరిష్కర్త కావచ్చు. పాకిస్థాన్ లో యీనాడు ఎదురుమాట్లాడే శక్తి లేదు కాబట్టి, వీటిని పరిష్కరించి, రెండుదేశాల మిత్రత్వాన్ని సుస్థిరంచేసి, శాశ్వతకీర్తిని పొందే అవకాశం అయూబ్ కొక్కడికే వున్నది. లేవనున్న యీ అపూర్వావకాశాన్ని అయూబ్ సద్వినియోగం చేస్తాడో లేదో చూడవలసివున్నది.

అయూబ్ అధికారానికి వచ్చిన నాటికీ, నేటికీ భారతదేశంపట్ల వారి వైఖరిలో ఎంతో మార్పు కనుపిస్తుంది. ఇండియాపట్ల ఆనాటి వారి విరోధవైఖరి, యీనాడు స్నేహసంబంధంగా మారడం శుభసూచకం. ఈ స్నేహ

—కొరవ 12వ పేజీలో

# తూపిలిచెరువు పునరుద్ధరణ: బాలిరెడ్డిపాళెం బ్లాకు

## ముక్తకంఠంతో ప్రజాప్రతినిధుల కోరిక: తప్పక ఆలోచిస్తామని ఆర్థికమంత్రి హామీ

## కోటలో ఆరు అభివృద్ధికార్యాలకు శంకుస్థాపనలు: ప్రారంభోత్సవాలు

ప్రతిగ్రామానికి శ్రీ నల్లపరెడ్డి చంద్రశేఖరరెడ్డివంటి నిస్వార్థులు, ఉత్సాహవంతులు అయిన యువకులు ఒక్కరున్నా దేశం అభివృద్ధి శీఘ్రతరంగా సాధ్యమయ్యే అవకాశం వున్నదని ఆంధ్రప్రదేశ్ ఆర్థిక, ప్రణాళికాశాఖల మంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి అన్నారు. కోటగ్రామంలో ఈనెల 1వ తేదీ ఏర్పాటయిన అనేక శంకుస్థాపనోత్సవాల తరవాత జరిగిన బహిరంగసభలో మాట్లాడుతూ ఆర్థికమంత్రి నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులవంటి భారీపథకాలను ప్రభుత్వం తప్ప ఇతరులు చేయడం సాధ్యం కాదనీ, అందుచేత ప్రభుత్వం వాటి నిర్వహణమీద దృష్టిని కేంద్రీకరించి, చిన్నవైన స్థానికాభివృద్ధి పనుల నిర్వహణ బాధ్యతను స్థానిక సంస్థలకు అప్పగించదలచిందని అన్నారు.

సెప్టెంబర్ 1 తేది సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమై, శంకుస్థాపనోత్సవాలు, ప్రవేశోత్సవాలు అన్నీకలసి ఆరు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ ఎగువశాసనసభ సభ్యులు, శ్రీ పొన్నలూరు వీరరాఘవరెడ్డి, శాసనసభ్యులు, ఆనం సంజీవిరెడ్డి, పెళ్లేటి గోపాలకృష్ణారెడ్డి, పాదిలేటి వెంకటస్వామి రెడ్డిగారలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గూడూరు మునిసిపల్ అధ్యక్షులు శ్రీ పసుపులేటి సిద్ధయ్యనాయుడు గారు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి దగ్గరనుంచి దూరంనుంచి చాలామంది ప్రజలు వచ్చారు. కార్యక్రమంతో, ప్రాంతంతో, సంబంధం ఉన్నవారు, లేనివారుకూడా ప్రభుత్వోద్యోగులు చాలామంది ఆ సాయంత్రం కోటను పావనంచేశారు. ఉత్సవానికిముందు శ్రీ నల్లపరెడ్డి చంద్రశేఖరరెడ్డి అల్పాహారవిందు, తరువాత శ్రీ అల్లారెడ్డి వెంకటకృష్ణారెడ్డి గారు పెద్దడిన్నరు చేశారు.

స్వాగతోపన్యాసంలో, ప్రెసిడెంట్ల ప్రెసిడెంటు, కోట ప్రెసిడెంటు శ్రీ నల్లపరెడ్డి చంద్రశేఖరరెడ్డి, కోట వాకాడు గ్రామాలు మినహా ఆ ప్రాంతంలో గ్రామాలన్నీ కనీసవసతులన్నా లేని వెనకబడ్డ గ్రామాలన్నారు. స్థానిక దాతృత్వంతో కోటలో జరిగిన అభివృద్ధిని వివరించారు. బాలిరెడ్డిపాళెం కేంద్రంగా ఆ ప్రాంతానికి ఒక అభివృద్ధిమండలం నెలకొల్పవలసిన అవసరాన్ని ఉద్ఘాటించారు.

తరువాత మాట్లాడిన శాసనసభ్యులు, అధ్యక్షోపన్యాసం చేసిన శ్రీ సిద్ధయ్యనాయుడు చంద్రశేఖరరెడ్డిగారి ఉత్సాహాన్ని, సేవానిరతిని ప్రశంసించారు. ఇంకా మిగులు అందరూ ఏకకంఠంతో బాలిరెడ్డిపాళెం బ్లాకు అవసరాన్ని వివరించారు. శ్రీ పెళ్లేటి గోపాలకృష్ణారెడ్డి, తూపిలి

—కొరవ 12వ పేజీలో



ఆర్థిక మంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి


పెండ్లిండ్లకు ******

****** అన్నీ క్రొత్తరకాలే!

కాశ్మీర్ బుటా — కాశ్మీర్ సెల్ఫ్ ఎంబోజ్

కొళ్ళయిగాల్ — ధర్మవరం

బనారస్ జార్జెట్ — మైసూర్ షిఫాన్

అన్నిటిలోను క్రొత్తక్రొత్త రకాలూ - క్రొత్తక్రొత్త బార్డర్లు.

::: లక్ష్మీ స్టోర్సు :::

చిన్నబజారు—నెల్లూరు

